
ఎన్నికల్లో.. ఎన్నెన్ని సిత్రాలో..

- గ్రామ పంచాయతీ ఎన్నికలకు దూరమైన అనేక మంది మాజీలు
- వార్డు సభ్యుడిగా ఓ జడ్పీటీసీ, సర్పంచ్
- సర్పంచ్ బరిలో మాజీ ఎంపీటీసీలు

7

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం 5 డిసెంబరు 2025

మూడోవిడత.. రెండో రోజు..

- ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు
- నేటితో ముగియనున్న నామినేషన్ల దాఖలు ప్రక్రియ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరంలో నామినేషన్ల పర్వానికి శుక్రవారం తెరపడనుంది. ప్రస్తుతం మూడోవిడత నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఊపందుకోగా.. గురువారం పలు గ్రామాల్లో అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. 7 మండలాల్లో 191 పంచాయతీల్లో 191 సర్పంచ్, 1742 వార్డు స్థానాలకుగాను భారీగానే నామినేషన్లు దాఖలయినట్లు సమాచారం. సింగరేణి, కల్లూరు మండలాల్లో గురువారం రాత్రివరకు నామినేషన్లు వేసేందుకు ఆశావహులు క్యూలు కట్టారు. ఇక శుక్రవారం నామినేషన్ల స్వీకరణకు చివరిరోజు కావడంతో పెద్దఎత్తున నామినేషన్లు వస్తాయని ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో శుక్రవారం నాటికి మూడు విడతలకు సంబంధించి నామినేషన్ల కార్యక్రమం ముగియనుంది. మూడో విడత నామినేషన్లను శనివారం పరిశీలిస్తారు. ఆదివారం అప్పీళ్లు స్వీకరిస్తారు. సోమవారం వాటిని పరిష్కరించి మంగళవారం నాడు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. రెండో విడతలో ఎన్నికలు జరిగే 6మండలాల్లోని 183 గ్రామపంచాయతీలు, 1,686 వార్డులకు సంబంధించి సర్పంచ్‌లకు 1055, వార్డులకు 4,160 నామినేషన్లు దాఖలవగా అధికారులు గురువారం అప్పీళ్లు స్వీకరించారు. శుక్రవారం ఈ అప్పీళ్లను పరిష్కరించాల్సి ఉండగా.. శనివారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఆ తర్వాత అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. రెండోవిడత అభ్యర్థులు ఆదివారం నుంచి ప్రచారంలోకి దిగనున్నారు.

గెలుపే లక్ష్యంగా..

ఖమ్మం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతోంది. తొలి విడతనామినేషన్ల పర్వం పూర్తి కావడం.. రెండోవిడత ఉపసంహరణ కార్యక్రమం కొనసాగుతుండటం.. మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుండటంతో గ్రామాల్లో సందడి కనిపిస్తోంది. గ్రామ రాజకీయాల్లో పార్టీల నేతలు బిజీబిజీగా మారారు. ఈ క్రమంలోనే తొలి విడత ప్రచార పర్వం కూడా ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరిగే విషయం తెలిసిందే. జిల్లాలో మొత్తం 571 పంచాయతీలకుగాను 566పంచాయతీల్లోనే ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో మొదటి విడతలో 7మండలాల్లో 192 పంచాయతీలకుగాను 20 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 172 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. రెండో విడత కింద ఈనెల 14న జరిగే ఎన్నికలకు గాను 6మండలాల్లో 183 పంచాయతీలు 1,686 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటికే రెండో విడతలో 5పంచాయతీల్లో ఒక్కో నామినేషను మాత్రమే దాఖలైంది. ఈ ఏకగ్రీవ ఎన్నికలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నామినేషన్ ఉపసంహరణ కార్యక్రమం ఈనెల6 వరకు ఉండగా.. మూడో విడత నామినేషన్ల కార్యక్రమం బుధవారం మొదలవగా.. శుక్రవారంతో ముగుస్తోంది.



- గ్రామబాటలో పార్టీల నేతలు
- మొదటి విడత ప్రచార పర్వంలో బిజీబిజీ
- రెండో విడతలో ఉపసంహరణ పర్వం
- మూడో విడత నామినేషన్ల ఘట్టంతో సందడే సందడి

సవాల్‌గా తీసుకున్న పార్టీలు..

కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికల పర్వం నడుస్తుండటంతో రాజకీయ పార్టీలు కూడా ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ విపక్ష బీఆర్ఎస్‌తోపాటు వామపక్షాలు, బీజేపీలు పలు చోట్ల తమ అభ్యర్థులను బరిలోకి దించాయి. కొన్ని చోట్ల అభివృద్ధి పనులు సర్దుబాట్లతో గ్రామాల్లో సామరస్యంగా ఏకగ్రీవం చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల రెబల్స్ బరిలో నిలుస్తున్నారు. దీంతో కొందరు సర్పంచ్ పదవి అధికార పార్టీ తీసుకుంటుండగా ఉపసర్పంచ్ ప్రత్యర్థి పార్టీకి ఇచ్చి ఏకగ్రీవాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్‌తో గ్రామాల్లో గొడవలు ఎందుకన్న కోణంలో విపక్ష పార్టీలు ఉపసర్పంచ్ తీసుకొని ఉపసంహరణకు సిద్ధమవుతుండగా కాంగ్రెస్‌లో మాత్రం సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు ఆశిస్తున్న రెబల్స్ నామినేషన్ల ఉపసంహరణకు ముందుకు రావటం లేదు. దాంతో కొన్ని చోట్ల పోటీ అనివార్యంగా మారింది. అధికార పార్టీ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ప్రత్యక్షంగా ప్రచారాల్లో పాల్గొనకపోయినా తమ అనుచరుల ద్వారా వ్యవహారాలు నడిపిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇతర జిల్లా నాయకులు కూడా పంచాయతీ ఎన్నికలపైనే దృష్టిసారించారు. కొన్నిచోట్ల అభివృద్ధి పనులతో పాటు నాయకులకు అవసరమైన కాంట్రాక్టు పనుల హామీలతోఉప సంహరణలు, పార్టీలోకి ఆహ్వానాలు, అభ్యర్థుల మద్దతు కూడ గడుతున్నారు.

గెలుపునకు అధికారపార్టీ పావులు..

ప్రతి పంచాయతీ గెలుపే లక్ష్యంగా అధికారపార్టీ పావులు కదుపుతోంది. కొన్ని పంచాయతీల్లో సీపీఐ మద్దతు తీసుకుంది. కాంగ్రెస్, సీపీఐ కూటమి ఈ ఎన్నికల్లో కూడా కనిపిస్తోంది. విపక్ష బీఆర్ఎస్ కూడా పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బలం ఉన్న చోట నెగ్గేలా బలం లేని చోట తగ్గేలా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో పట్టుదలతో ఉన్న చోట సీపీఎం, కాంగ్రెస్ వర్గాల సహకారంతో వ్యూహాత్మకంగా పోటీకి సై అంటోంది. ఘర్షణలు, పోటీ తట్టుకోలేని చోట సర్పంచ్ కాంగ్రెస్‌కు వదిలేసి ఉపసర్పంచ్ వార్డు సభ్యులతో సర్దుబాటు చేసుకుంటున్నారు. సీపీఎం, సీపీఐలు తమకు బలం ఉన్న చోట అభ్యర్థులను బరిలో దించగా బలం లేని చోట తమతో కలిసొచ్చేవారికి సహకారం అందిస్తున్నారు. మొత్తం మీద బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నేతలు, వామపక్షాల నేతలంతా పంచాయతీ ఎన్నికలపైనే దృష్టిపెట్టి పావులు కదుపుతున్నారు. పంచాయతీలు గెలిస్తే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో బలం ఉంటుందని రాజకీయ ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి. మొత్తం మీద పంచాయతీ ప్రచార పర్వం జిల్లాలో వేడెక్కుతోంది.

50 ఏళ్లుగా ఏకగ్రీవమే

- పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి ఇదే సంప్రదాయం
- రెండుసార్లు సర్పంచ్‌గా కొనసాగిన మాజీ మంత్రి వెంకటరెడ్డి
- మరో ఏడుగురు ఆదివాసీలకు కూడా దక్కిన అవకాశం
- అభివృద్ధిలో ముందుంటున్న పాతలింగాల

7



ఎన్నికల్లో ఘర్షణలకు తావివ్వొద్దు

- పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- సీపీ సునీల్ దత్

స్వపక్షం నుంచే.. పోటాపోటీ

- సత్తుపల్లి సెగ్మెంట్‌లో సర్పంచ్ అభ్యర్థులకు రెబల్స్ బెడద
- పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల చెట్టాపట్టాల్
- రెబల్స్‌కు బీఆర్ఎస్ మద్దతు
- తల్లాడ మండలంలో బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్



స్వపక్షంలోనే విపక్షం అంటే బహుశా ఇదేనేమో.. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు గ్రామ పంచాయతీలకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించి వారికి మద్దతివ్వాలని గ్రామ స్థాయి నాయకులకు సూచిస్తున్నారు. అయితే సర్పంచ్ పదవికి పోటీ చేయాలని భావిస్తున్న అధికార పార్టీలోని కొందరికి ఆశాభంగం జరగడంతో.. వారు కూడా పోటీకి సై అంటున్నారు. ఫలితంగా అధికార పార్టీకి చెందినవారు.. సొంత పార్టీ నేతల పైనే పోటీకి సై అంటున్నారు. పోటాపోటీగా నామినేషన్లు వేస్తూ.. స్వపక్షానికే విపక్షంలా సవాల్ విసురుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, సత్తుపల్లి

7

అటవీ భూముల ఆక్రమణను

ఉపేక్షించొద్దు

- వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి
- కోతుల సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి
- అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణను ఉపేక్షించవద్దని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాల్వల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పొరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న 100 ఎకరాలు బదిలీ చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన కార్పొరేషన్ సొసైటీ భూములను సర్వేయర్‌ను కేటాయించి భూముల సర్వే చేపట్టాలని, సోమవారం నాటికి 100 ఎకరాల భూమి సీఏ కోసం బదలాయింపు ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.

పోడు భూముల పట్టా పొందిన రైతులను మభ్యపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్టు సమాచారం అందుతుందని, రెవెన్యూ శాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ జంతువులను వేటాడితే రూ.25వేల నుంచి లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పోడు భూముల పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి (మిగతా 8వ పేజీలో)

'పేరుకే పెద్దరికం' అన్న చందంగా మారింది కొత్తగూడెం కార్పొరేషన్ పరిస్థితి. పది నెలల క్రితం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన కొత్తగూడెంలో పారిశుధ్య నిర్వహణ మొదలు.. సిబ్బంది నియామకాల వరకు అన్నిటిలోనూ అయోమయ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరపాలక సంస్థగా మారిన తర్వాత పట్టణ అభివృద్ధిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మరీ ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ మెరుగు పడుతుందని ఆశించారు. కానీ గతం కంటే ఎక్కువగా అధ్వానంగా తయారవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దంలా మెరవాల్సిన నగరపాలక సంస్థ కాస్త అధ్వానంగా తయారైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

6

పెద్దరికం.. పేరుకే!



కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగిస్తున్న సిబ్బంది

- ఆచరణలో లోపభూయిష్టం
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- కాల్వల్లో పేరుకుపోతున్న మురుగు
- పబ్లిక్‌హెల్త్ వర్కర్ల నియామకానికి మంగళం
- ఉద్యోగ విరమణ చేసిన వారిస్థానంలో భర్తీకి నోచుకొని ప్రక్రియ

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణ పడకేయడంతో పరిసరాల్లో అపరిశుభ్రత పెరిగిపోయిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నిత్యం చెత్తను తొలగించకపోవడంతో అంతర్గత వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. మార్కెట్ ఏరియాల్లోని కాల్వల్లో మురుగు శుభ్రం చేయడాన్ని మరిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. ప్రత్యేక నిధులు పుష్కలంగా ఉన్నా సఫాయి మిథ్యగానే మారింది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి పెనుముప్పు పొంచిఉంది. కార్పొరేషన్‌లో పర్యవేక్షణ లోపించడంతో పారిశుధ్య చర్యలు మృగ్యమయ్యాయి. దోమలు ప్రబలుతున్నా.. జ్వరాలు బాధిస్తున్నా.. వీధుల్లో బ్లీచింగ్ జాడలేదు. ఫాగింగ్ మాటే ఎత్తడం లేదు. డ్రెయినేజీలు, వీధులను శుభ్రం చేయాల్సిన పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్ల కొరత రోజురోజుకు పెరిగిపోతోంది. వారి నియామకాలపై కార్పొరేషన్ దృష్టి సారించడం లేదు. పురపాలక సంఘంగా ఏర్పాటైనా ఉద్యోగ, కార్మికుల నియామక క్యాడర్ మినహా... ఈరోజు వరకు క్యాడర్ పోస్టుల పెంపు ప్రక్రియ జరగడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అంచనా వేయవచ్చు. 1995 మే 8న నోటిఫైడ్ ఏరియా నుంచి పురపాలిక సంస్థగా ఏర్పడింది. అప్పటి నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన ఈ 30 ఏళ్ల ప్రస్థానంలో 200 ఉన్న పర్మినెంట్ (మిగతా 6వ పేజీలో)

3 లక్షలకు పైగా జనాభా..

పారిశుధ్య పనులు మెరుగుపడాలంటే వీధులు శుభ్రం చేసే స్వీపర్లు, డ్రెయినేజీల్లో వ్యర్థాలు తొలగించే కార్మికుల నియామకం జరగాల్సి ఉంది, కార్పొరేషన్‌లో దశాబ్దాలుగా ఈ రెండు క్యాడర్లలో నియామకాలు నిర్వహించడం లేదు. కొత్తగూడెం పట్టణంలో 97,337మంది, పాల్వంచ పట్టణంలో 89,721మంది, సుజాతనగర్ 7పంచాయతీల్లో 11,124 మంది జనాభాతో కలిపి కార్పొరేషన్ పరిధిలో 1,98,182 మంది ఉన్నారు. వీరితో పాటు ఉపాధి కోసం వలస వచ్చిన వారు జీవనం సాగిస్తున్నారు. ప్రతీ 10వేల జనాభాకు కనీసం 20మంది పారిశుధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలనే నిబంధనలున్నాయి. ఈ లెక్క ప్రకారం చూస్తే కార్పొరేషన్ పరిధిలో 85.22 చ.కి.మీ వైశాల్యంలో జనభా 3లక్షలకు పైబడి ఉంది. 600మందికి పైగా పర్మినెంట్ స్వీపర్లు, కమాటిలు ఉండాలి. కానీ కేవలం 29మందితో మాత్రమే పర్మినెంట్ పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. కొరత ఏర్పడిన 571 మంది నియామక చర్యలకు మంగళం పాడారు.

నేటినుంచి ఆన్‌లైన్‌లో ఉత్తర ద్వార దర్శన టికెట్ల విక్రయాలు

భద్రాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి పర్వదినం సందర్భంగా ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న వైకుంఠఏకాదశి మహోత్సవాలకు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల30న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారిని ఉత్తరద్వారంలో ప్రత్యక్షంగా తిలకించే భక్తులకోసం దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం నుంచి టికెట్ల విక్రయాలను ప్రారంభించనుంది. రూ.2వేలు, రూ.1000, రూ.500, రూ.250 విలువ గల సెక్టార్ టికెట్లను ప్రత్యక్షంగా badradritemple.telangana.gov.inలో భక్తులకు అందుబాటులో ఉంచారు. అలాగే ఉత్తర ద్వార దర్శనంలో ప్రత్యక్షంగా దర్శించుకోలేని భక్తులు పరోక్ష సేవలు సైతం భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చింది. రూ.2వేలు, రూ.1000 వెబ్‌సైట్ ద్వారా బుధవారం ఉదయం 11 గంటల నుంచి బుకింగ్ సదుపాయం కల్పించినట్లు ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు ఈ నెల 18 నుంచి ఈ నెల30 తేదీన తెల్లవారుజాము 5 గంటల వరకు దేవస్థానం తానీషా కల్యాణ మండపంలోని సీఆర్‌వో కార్యాలయంలో ఒరిజినల్ టికెట్లను పొందవచ్చునని సూచించారు. భక్తులు దేవస్థానం కల్పించిన ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న రామయ్య(ఫైల్)

ఆయమ్మే... టీచరమ్మ

దుమ్ముగూడెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బట్టిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా టీచర్‌గా మారింది. రెండేళ్ల క్రితం టీచర్ పదవీ విరమణ చేయగా నాటినుంచి అక్కడ ప్రాథమిక విద్యను బోధించేవారు కరువయ్యారు. దీంతో ఆయమ్మ మడకం సోమమ్మ తనకు వచ్చిన తెలుగు పదాలు పిల్లల పలకలపై రాసి చదివిస్తోంది. అంగన్‌వాడీ భవనం సైతం శిథిలావస్థకు చేరగా, అద్దె భవనంలో నడుస్తోంది. టీచర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడి చిన్నారులను వ్యయ ప్రయాసలకోర్చి లక్ష్మీనగరం ప్రైవేటు బడులకు పంపాల్సి వస్తోంది. దబ్బనూతల అంగన్‌వాడీ టీచర్ ఇన్‌చార్జి కాగా, అప్పుడప్పుడూ వచ్చి పిల్లల బరువు నమోదు చేసుకొని వెళ్తారు.



చిన్నారులను చదివిస్తున్న సోమమ్మ

మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం

- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్
- మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

ఖమ్మంకలెక్టరేట్/కొత్తగూడెంకలెక్టరేట్ డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని ఖమ్మంకలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. కొణిజెటి రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడిఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళ నాడు, కర్నాటక రాష్ట్రాల గవర్నర్ ఆయన సేవలు మరువలేనివన్నారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.



మాజీ సీఎం రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్



కొత్తగూడెంలో రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్

రోశయ్య గొప్ప సేవలందించారు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రజాప్రతినిధిగా దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య గొప్ప సేవలు అందించారని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గో వర్ధంతి సభను కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. రోశయ్య రాజకీయ జీవితమంతా ప్రజల సంక్షేమం, నిస్వార్థ సేవకే అంకితమైందనిఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి పరంధామరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో నేడు కృత్తికా దీపోత్సవం



పవిత్ర గోదావరి నుంచి తీర్థబిందెను తీసుకొస్తున్న దృశ్యం

సంప్రదాయబద్ధంగా అంకురార్పణ

భద్రాచలం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఏటా నిర్వహించే కృత్తికా దీపోత్సవానికి గురువారం సాయంత్రం సంప్రదాయబద్ధంగాఅంకురార్పణ గావించారు. పవిత్ర గోదావరి నుంచి తీర్థబిందెను మేళతాళలతో తీసుకొచ్చారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, కలశావాహన తదితర పూజా కార్యక్రమాలనునిర్వహించారు. కృత్తికా దీపోత్సవం సమయాన శుక్రవారం ఉదయం శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక స్నపనం నిర్వహించనున్నారు. రాత్రిపోలీసు శాఖ తరపున కృత్తికా దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ తరపున అధికారులు పాల్గొని సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కృత్తికా దీపోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రామయ్య కల్యాణాన్ని నిర్వహించరు.

వైభవంగా రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచం ద్ర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణంలో భాగంగా స్వామి వారిని నిత్య కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి ఆసీనులను చేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యహవచనం,కంకణధారణ. యజ్ఞోపవీత ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదఆశీర్వచనంతో కళ్యాణ ప్రక్రియ నిర్వహించారు. ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.



భద్రాద్రి జిల్లా విద్యార్థులకు ప్రశంసలు

- భారత స్కౌట్స్అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో ప్రతిభ



జాతీయ జంబోరీలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెంఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి):ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జంబోరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లావిద్యార్థులు పలు అంశాల్లో ప్రశంసలు అందుకున్నారు. అత్యధికంగా 47మందిస్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిశారు.జాతీయ స్థాయి జంబోరీలో పాల్గొన్నముగ్గురు, గైడ్ కెప్టెన్లు జి.లక్ష్మీ,జి. అమృత, ఎస్.భారతమాత, స్కౌట్స్ మాస్టర్స్ అజిత్ కుమార్, యండి. అమీర్ సారధ్యంలో రాష్ట్రంతరుపు పాల్గొన్నారు. ఇల్లెందు మార్గదర్శిని పాఠశాల, కొత్తగూడెం త్రివేణి పాఠశాల, పాల్వంచ నవభారత పబ్లిక్‌పాఠశాల, భద్రాచలం సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నగా డీఈఓ, స్కౌట్అండ్‌గైడ్స్ చీఫ్ కమీషనర్ బి.నాగలక్ష్మి, కమిషనర్ ఉండేటి ఆనంద్ కుమార్,స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ముత్తెబోయిన శ్రీనివాసరావుఅభినందించారు. ఈ జంబోరీలో దాదాపు 250అంశాలైన మార్చ్‌ఫాస్ట్, జానపద నృత్యం, స్కిలోరమా, రంగోలి, ఫుడ్ ఎగ్జిబిషన్, సైన్స్ ఎక్స్‌పో, వ్యర్థం నుంచి అర్థం మొదలగు అంశాలలో ప్రతిభ కనపరిచారు.

ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ అపహరణ

కరకగూడెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వరుస చోరీలు జరుతున్నాయి. గతనెల 26న వీరాపురం పామాయిల్ తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను దొంగలు దొంగిలించారు. పదిరోజులు గడవక ముందే మండలంలో రెండు ట్రాన్స్‌పార్మర్ల కాపర్‌ను దొంగిలించారు. మండలంలోని మోతే పరిధిలోని వేరువేరు ప్రదేశాల్లో బుధవారం రాత్రి రెండు ట్రాన్స్‌పార్మర్లలో కాపర్‌లను దొంగలు ఎత్తుకెళ్లారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల విలువ రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని , దొంగలు ఎత్తుక వెళ్లిన కాపర్ విలువ రూ.80 వేలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

రైతురత్న పురస్కారం అందుకున్న రమేష్



కొణిజర్ల/వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం వైరా మునిసిపాలిటీ పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన ఆదర్శరైతు జాలాది రమేష్ రైతు రత్నపురస్కారాన్ని అందుకున్నారు. మహా కిసాన్ మేళా కన్హా శాంతివనం హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ కమీషన్ వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి నుంచి ఈ అవార్డు తీసుకున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులకు సేంద్రీయ వ్యవసాయం,మిశ్రమ వ్యవసాయం చేసే ఆదర్శ రైతులను జిల్లాకు ఒక్కరు చొప్పున ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు.

రేపు, ఎల్లుండి క్రెడాయ్ మెగా ఎక్స్‌పో

- ప్రారంభించనున్న మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న క్రెడాయ్ ప్రతినిధులు

ఖమ్మంఖానాపురం హవేలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ మైదానంలో ఈనెల 6,7 తేదీల్లో క్రెడాయ్ ఆధ్వర్యంలో మెగా ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఖమ్మం అధ్యక్షుడు బండి జయకిషోర్, సంఘం సభ్యులు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. 2021లో తొలిసారి ఖమ్మంలో ఎక్స్‌పో నిర్వహించగా విజయవంతమైందనీ, ఈ మూడోసారి కూడా ఖమ్మంలో క్రెడాయి ప్రాపర్టీఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 60 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఖమ్మంతోపాటు హైద్రాబాద్ బిల్డర్స్ అసోషియేషన్ కూడ ఈ ఎక్స్‌పోలో పాల్గొంటుందని అన్నారు. ఈ ఎక్స్‌పోకు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి క్రెడాయి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హజరవుతున్నట్లు తెలిపారు. ఇంటినిర్మాణాలకు సంబంధించిన అన్నీరకాల వస్తువులకు సంబంధించి ఎక్స్‌పోలో పలు సంస్థలు పాల్గొని వివరాలనుతెలుపుతారన్నారు.ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, భవన నిర్మాణసంస్థలు, డీటీసీపీ లేఅవుట్ల వెంచర్ల కంపెనీలు, భవన నిర్మాణ సామగ్రి చెందిన సంస్థలు, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలవంటి సంస్థలు ఈఎక్స్‌పోలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎక్స్‌పో నిర్వాహణలో భాగంగా సందర్శకుల రిజిస్ట్రేషన్‌లతో ప్రతీ గంటకు లక్కీడ్రా నిర్వహిస్తామని చెప్పారు.7వతేదీ బంపర్‌డ్రా నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఎక్స్‌పోను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో క్రెడాయ్ సభ్యులు పెద్ది కేశవరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, వేములపల్లి నగేష్, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, నంబూరి ప్రసాద్, తుళ్లూరి నాగేశ్వరరావు, దేవభక్తిని హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో 20ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం కన్వాఖేడా బిల్వారా ప్రాంతానికి చెందిన భాగ్‌చంద్ భైర్వాకు గంజాయి కేసులో 20సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు లక్షరూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లాప్రధాన న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పుచెప్పారు. 2024లో ఖమ్మంలో అప్పటి ఎక్సైజ్ డీటీఫ్ ఖమ్మంసీఐ ఆర్.విజేందర్ తనిఖీలు నిర్వహిస్తుండగా సుమారు 22కేజీల ఎండుగంజాయితో రాజస్థాన్‌కు చెందిన భాగ్‌చంద్ భైర్వా, పింటూకుమార్ రేగర్ పట్టుపడ్డారు. వారిని ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం-2కి అప్పగించారు.నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి జుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. కేసులోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ బోయిన వెంకటేశ్వర్లు, హోంగార్డ్ యం.డి.ఆయుబ్ సహకరించారు.

మరో కేసులో ఇద్దరికి పదేళ్లు

సూర్యాపేటకు చెందిన చెందిన కానుక్కుర్తి నవీన్, నేరెళ్లశ్రీరాములులకు గంజాయి కేసులో పదేళ్ల శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పుచెప్పారు. 2022లో ఖమ్మంలోని కొత్తబస్టాండ్‌వద్ద అప్పటి ఖమ్మం- 1 ఎక్సైజ్ సీఐరాజు తనిఖీలు నిర్వహిస్తుండగామోటర్ సైకిల్‌పై 7కేజీలఎండు గంజాయి తరలిస్తూ సూర్యాపేటకు చెందిన కానుక్కుర్తి సాయినవీన్, నేరెళ్ల శ్రీరాములు, అలేగి గణేష్, బట్టు హరీష్ పట్టుబడ్డారు.నిందితులను రిమాండ్‌కు తరలించారు. సాక్షులను విచారించి నిందితులపై నేరంరుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు. కేసులోమూడో, నాలుగో నిందితులు ఆలేటిగణేష్,బట్టు హరీష్ పరారీలో ఉండగా వారెంట్ జారీచేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ కుమార్‌రెడ్డి, కోర్టుకానిస్టేబుల్ టి.మారేశ్వర్ రావు, హోంగార్డు ఆయుబ్ లు సహకరించారు.

ఏపీ సీఎం సతీమణి భువనేశ్వరి వాహనం తనిఖీ



నారా భువనేశ్వరి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కూసుమంచి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి వాహనాన్ని ఖమ్మం జిల్లా సరిహద్దులో ఖమ్మం జిల్లా అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాల సరిహద్దులో ఉన్న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. గురువారం సాయంత్రం నారా భువనేశ్వరి హైదరాబాద్ నుంచి ఖమ్మం, అశ్వారావుపేట మీదుగా ఏపీలోని జంగారెడ్డిగూడెం వెళుతుండగా నాయకన్‌గూడెం చెక్‌పోస్టు వద్ద ఖమ్మం జిల్లా పోలీసులు, అధికారులు భువనేశ్వరి వాహనాన్ని తనిఖీ చేసి పంపారు.

బియ్యం పక్కదారిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు



గోదాములో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం పరిధిలోని జీసీసీ కేంద్రం నుంచి లారీ బియ్యం 300 క్వింటాలు పక్కదారి పట్టడంతో విజిలెన్స్ ఎన్ఫోర్స్ ఓఎస్‌డి అంజయ్య ఆధ్వర్యంలో పదిమంది బృందం గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. రికార్డుల పరంగా బియ్యం నిల్వలను పరిశీలించారు. గోదాం ఇన్‌చార్జ్, 9 మంది డీలర్లను అదుపులోకి తీసుకొని విచారణ నిర్వహించగా లారీ బియ్యం తరలించారని చెప్పడంతో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. బియ్యం పక్కదారి కారణమైన గోదాం ఇన్‌చార్జ్, డీలర్లను అదుపులోకి తీసుకుని పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి వీరిపై పిర్యాదుచేశారు.

ప్రతిభ చాటిన ఆదివాసీ విద్యార్థికి ప్రశంస



విద్యార్థిని అభినందిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో వర్చువల్‌గా ఇటీవల జరిగిన ప్రపంచ బాల సాహిత్య వేదికలో పాల్గొన్న భద్రాచలంలోని యజ్ఞా పాఠశాలలో 8వ క్లాస్ చదువుతున్న ఆదివాసీ విద్యార్థిని మడివి గురుత్వ సమందా సింగ్‌ను ఐటీడీఏ పీవో బి రాహుల్ అభినందించారు. కథా విభాగంలో కోయజాతి ప్రతినిధిగా ఆమె కోయ సంప్రదాయ వేషదారణలో పాల్గొని పేన్ పండుగ ఇతివృత్తం ఆధారంగా పేన్ పండుం అడవి రహస్యం కథను వినిపించారు.తానా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో విద్యర్థిని ప్రతిభ చాటటం పట్ల పివో ప్రత్యేకంగా అభినందించారు.

హేమచంద్రాపురం రహదారికి మహర్దశ

- సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు కోసం సింగరేణి నిధులు
- రూ. 20 కోట్లతో పనులను చేపట్టేందుకు రంగం సిద్ధం




ప్రమాదాలకు నిలయంగా మారిన హేమచంద్రాపురం రోడ్డు (ఫైల్ ఫొటో)

కొత్తగూడెం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్‌నుంచి హేమచంద్రాపురం గ్రామం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టాన్ని ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో హేమచంద్రాపురం రహదారికి మహర్దష పట్టనుంది. సింగరేణి యాజమాన్యం పోస్టాఫీస్ నుంచి హేమచంద్రాపురం వరకు రహదారి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు పలు రహదారులకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి యాజమాన్యం నిధులు మంజూరు పచ్చ జెండా ఊపింది. సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తుంది. పోస్టాఫీస్ నుంచి హేమచంద్రాపురం రోడ్డుతో పాటు సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధాన ఆసుపత్రి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. బస్టాండ్ సెంటర్ నుంచి రైటర్ బస్తీలోని త్రిమాత దేవాలయం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టాన్ని త్వరలో పనులు చేపట్టేందుకు సింగరేణి అధికారులు యుద్ధ ప్రాతిపదికమీద చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సింగరేణి ఎస్టేట్‌తో పాటు ఇతర విభాగాల అనుమతులను సైతం తీసుకుని ముందుకు సాగుతున్నారు. కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడం, ప్రమాదాలు జరగడం, ప్రమాదాల్లోపలువరు ప్రాణాలు కోల్పోవడంతో పోలీస్ అధికారులు కొత్తగూడెం పట్టణంలోకి ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలను అనుమతించక పోవడంతో భారీ వాహనాలు అన్ని పోస్టాఫీస్ నుంచి హేమచంద్రాపురం మీదుగా భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ప్రధానంగా ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ నుంచి టిప్పర్లు, కొత్తగూడెం సీఎస్‌పికి నిత్యం సుమారు 30 టన్నుల లోడ్‌తో రావడం వల్ల రోడ్లు గుంటల మయంగా మారాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు సమీప ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిపై శేషగిరినగర్, హేమచంద్రాపురం, కారుకొండ గ్రామస్తులు భారీ వాహనాలను తమ గ్రామాల గుండా రాకుండా ఆందోళన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సైతం పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు నూతన రోడ్లను నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలంటూ సింగరేణి చైర్మన్ బలరాం తో పాటు అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరుకు యాజమాన్యం చర్యలు చేపట్టడంతో ఆ రహదారికి కొత్త అందాలు వచ్చే అవకాశాలు ఏర్పడుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించా..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



పోస్టాఫీస్ నుంచి హేమచంద్రాపురం వరకు వెళ్లే రహదారి ఇబ్బందికరంగా ఉండడంతో సింగరేణి అధికారులపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించా.. రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సింగరేణి నిధులతో పోస్టాఫీస్ నుంచి హెమచంద్రాపురం రహదారి రూపురేకలు మారే అవకాశం ఉంది. నిధుల మంజూరికి కృషి చేసిన అధికారులకు అభినందనలు.

రహదారి నిర్మాణం కోసం ఆందోళన చేశాం..

కల్లెం నరసింహారావు



రహదారి గోతుల మయం కావడంతో ద్విచక్ర వాహనాలకు సైతం రాకపోకలు సాగించడానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాము. భారీ వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. పోస్టాఫీస్ నుంచి హేమచంద్రాపురం వరకు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉంది. నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలి.

పెద్దరికం.. పేరుకే!

(5వ పేజీ తరువాయి)

పీహెచ్ వర్కర్ల సంఖ్య 30మందికి పడిపోయింది. ఉద్యోగ విరమణ చేసిన పీహెచ్ వర్కర్ల స్థానంలో ఏర్పడుతున్న ఖాళీల భర్తీకి కార్పొరేషన్ చర్యలు తీసుకోవడం లేదు.

కార్పొరేషన్‌లో అంతా పొరుగు సేవలే..

పర్మినెంట్ కార్మికులు పనిచేయాల్సిన చోట పొరుగు సేవల కింద నియామకాలు చేపట్టి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం 320మంది స్వీపర్లు, మురుగుకాల్వలు శుభ్రం చేసే కార్మికులు పొరుగుసేవల కింద పనిచేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులు కొత్తగూడెంలో 21మంది, పాల్వంచలో 8మందితో పాటు పొరుగుసేవల కింద కొత్తగూడెంలో 175మంది, పాల్వంచలో 137మంది, (పాత సుజాతనగర్‌మండలం) ఇటీవల కార్పొరేషన్‌లో వీలినమైన 7పంచాయతీల్లో 26మంది కార్మికులు కలిపితే 367మంది అవుతున్నారు. నిబంధనల ప్రకారం 571మంది పనిచేయాల్సిన చోట 367మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 204మంది కొరత కొనసాగుతూనే ఉంది.

ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకే ఇసుక

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్

కొత్తగూడెం టౌన్, డిసెంబరు 04 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ, భూగర్భ శాఖ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఇసుక రవాణా కోసం పలు ఇసుకరీచ్‌లను గురువారం పరిశీలించారు. పాల్వంచ మండలంలోని దంతెలబోరు, రంగాపురం, బూర్గంపాడు మండలంలోని సోంపెల్లి ఏరియాలో ఇసుక రీచ్‌లను త్వరలో ప్రారంభించనున్నారు. బూర్గంపాడు, పాల్వంచ, తహసీల్దార్‌ల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇసుకను బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎంఆర్ఓలకు లాగిన్ ఐడీ ఇచ్చి వాహనాల వివరాలు మొబైల్ యాప్‌లుగా మీ సేవా సెంటర్ నుంచి ఇసుకను బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ప్రకటించారు. సాండ్ టాక్స్ పరిధిలోకి రావల్సిన ట్రాక్టర్ యజమానులు సాండ్ టాక్స్ కోసం మీ సేవలను సంప్రదించాలని కోరారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. మన ఇసుక వాహనం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్ తప్పనిసరిగా నమోదు చేయాలి

- ప్రతీ పీహెచ్‌సీ స్థాయిలో సమీక్షలు జరగాలి
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం



సమీక్షలో మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పీహెచ్‌సీలో ఎన్సీడీ ఆన్‌లైన్, హెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ ఇతర ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లను క్రమం తప్పకుండా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ఐడీఓసీలో వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షకులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న కాన్పులు, క్షయ వ్యాధి నియంత్రణ, కుష్టు వ్యాధి కార్యక్రమాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారీగా సమీక్షించారు. పీహెచ్‌సీ స్థాయిలో సమీక్ష సమావేశాలను నెలలో రెండు సార్లు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల తర్వాత సమీక్ష సమావేశం నిర్వహించాలని, ఉదయం ఓపి సేవలను పూర్తిగా నిర్వహించాల్సిందిగా కోరారు. ప్రతీ నెల మూడవ వారంలో శ్రమదానం ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పనికిరాని వస్తువులను ముగ్గురు సభ్యుల కమిటీ ద్వారా పరిశీలించి తొలగించాలని సూచించారు. స్కూళ్లు, కళాశాలలో వైద్య శిబిరాలు నిర్వహించి, వాటికి సంబందించిన రిపోర్టులను సమయానికి పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి, మాత, శిశువు కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సమీక్షలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ఫుల్లారెడ్డి, ఇమ్యునైజేషన్ అధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పాత లింగాల గ్రామ పంచాయతీ కార్యాలయం

50 ఏళ్లుగా ఏకగ్రీవమే

- పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి ఇదే సంప్రదాయం
- రెండుసార్లు సర్పంచ్‌గా కొనసాగిన మాజీ మంత్రి వెంకటరెడ్డి
- మరో ఏడుగురు ఆదివాసీలకు కూడా దక్కిన అవకాశం
- అభివృద్ధిలో ముందుంటున్న పాతలింగాల

కామేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దివంగత రాష్ట్ర నేతలు రాంరెడ్డి వెంకటరెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో ఏళ్ల తరబడి ఏకగ్రీవ పరంపర కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు వస్తే చాలు.. ఇక్కడ ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. ఆనాడు దివంగత నేత వెంకటరెడ్డి రాజకీయ ప్రస్థానం సర్పంచ్ నుంచే మొదలైంది. ఈ గ్రామంలో తొలుత 1967లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో రాంరెడ్డి వెంకటరెడ్డి సర్పంచ్ అయ్యారు. అనంతరం 1972లో ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యారు. రెండు దఫాలుగా దివంగత నేత రాంరెడ్డి వెంకటరెడ్డి సర్పంచ్‌గా పని చేశారు. లింగాల పంచాయతీ నుంచి ఆ తర్వాత గ్రామ పంచాయతీ షెడ్యూల్ తెగగా మారడంతో.. 1977లో కిన్నెర చంద్రయ్య రెండు సార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పని చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు జరగలేదు. కిన్నెర వీరయ్య, బురుగు వీరయ్య, బురుగు శ్రీలత, కిన్నెర స్వరూప, కిన్నెర నాగయ్య, కిన్నెర సుజాతతో కలిపి 50ఏళ్లుగా ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవ ఎన్నికవుతూనే.. పంచాయతీలను ఆదర్శంగా నడిపిస్తున్నారు. పాత లింగాల గ్రామ పంచాయతీలో 788మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 381మంది కాగా, మహిళా ఓటర్లు 407మంది ఉన్నారు. దివంగత రాష్ట్ర నేతలు కాలం చెందిన నాటి నుంచి గ్రామంలో గ్రామ పెద్దగా వ్యవసాయ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి నేతృత్వంలో గ్రామ సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధిపై పాలకవర్గంతో సమీక్షించి.. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

50ఏళ్లుగా ఏకగ్రీవ సర్పంచే..



గోపాల్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు

మా అన్న రాంరెడ్డి వెంకటరెడ్డి ఉన్న నాటి నుంచి గ్రామంలో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నాం. 50ఏళ్లుగా ఏకగ్రీవ సర్పంచే.. గ్రామ ప్రజల అభిప్రాయాల మేరకు సర్పంచ్‌ను ఎన్నుకుంటున్నాం. గ్రామాన్ని అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయిలో నిలపడమే మా ధ్యేయం. గత పాలకులు ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు ఇస్తామని చెప్పి.. మోసపూరిత హామీలు చేసినప్పటికీ.. మేము మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం.

అందరి సహకారంతో ఈసారి కూడా..



కిన్నెర సుజాత, ప్రస్తుత ఏకగ్రీవ సర్పంచ్

మా గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహకారంతో సర్పంచ్‌కు, ఎనిమిది వార్డులకు నామినేషన్ వేశాము. రెండు రోజుల్లో అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్లను అధికారికంగా ప్రకటించడమే తరువాయి. గతంలో సర్పంచ్‌గా నాభర్త నాగయ్య పని చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా గ్రామ పెద్దలు నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేయడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో గ్రామ అభివృద్ధికి తోడ్పడతాను.

గతంలో గ్రామ సర్పంచ్‌లుగా చేసిన వారు..

రాంరెడ్డి వెంకటరెడ్డి (రెండు సార్లు), కిన్నెర చంద్రయ్య, కిన్నెర చంద్రయ్య, కిన్నెర వీరయ్య, బురుగు వీరయ్య, బురుగు శ్రీలత, కిన్నెర స్వరూప ,కిన్నెర నాగయ్య, కిన్నెర సుజాత

స్వపక్షం నుంచే.. పోటాపోటీ



సత్తుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

- సత్తుపల్లి సెగ్మెంట్‌లో సర్పంచ్ అభ్యర్థులకు రెబల్స్ బెడద
- పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల చెట్టాపట్టాల్
- తిరుగుబాటు అభ్యర్థులకు బీఆర్‌ఎస్ మద్దతు
- తల్లాడ మండలంలో బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్

పల్లె సమరం 2025

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్థానికంగా చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. మూడో విడతలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 130 గ్రామ పంచాయతీలకు గాను 129 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయా పంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు గ్రామ పంచాయతీలకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించి వారికి మద్దతివ్వాలని గ్రామ స్థాయి నాయకులకు సూచిస్తున్నారు. పార్టీ రహితంగా జరిగే ఎన్నికలేనప్పటి నుంచి సామాజిక వర్గాల సమీకరణాలు, అన్ని హంగులున్న వారిని సర్పంచి అభ్యర్థులుగా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ పదవికి పోటీ చేయాలని భావిస్తున్న మరికొందరికి ఆశాభంగం జరగడంతో.. వారు కూడా పోటీకి సై అంటున్నారు. కొందరు అధికార పార్టీకి చెందిన వారు సొంత పార్టీ నేతల పైనే పోటీ కోసం నామినేషన్లు దాఖలు చేస్తున్నారు.

అధికార, విపక్ష నాయకుల చెట్టాపట్టాల్

సర్పంచ్ పదవికి అభ్యర్థిత్వం ఆశించి.. సొంత పార్టీ మద్దతు లభించక పోవడంతో కొందరు బీఆర్ఎస్ మద్దతుతో పోటీకి దిగుతున్నారు. కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు మద్దతు ఇస్తున్నారు. సత్తుపల్లి మండలంలో ప్రధానంగా కిష్టారం, బేతుపల్లి, తుంబూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్యే పోటీ జరగనున్నట్లు తెలిసింది. వీరిలో ఒకరికి బీఆర్ఎస్ మద్దతు ప్రకటించేందుకు సిద్ధమైన ట్లు సమాచారం. బేతుపల్లిలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి మద్దతివ్వడం ద్వారా అక్కడి ఉప సర్పంచ్, ఐదు వార్డు సభ్యులను దక్కించుకునే విధంగా చర్చలు సాగుతున్నాయి. కిష్టారంలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు సర్పంచ్ పదవికి పోటీ చేయనునున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్లు వేయాలని నిర్ణయించినప్పటికీ.. నామినేషన్ల ఉపసంహరణ సమయంలో ఎవరు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇదే పంచాయతీలో కాంగ్రెస్ నుంచి మరో నాయకుడు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వేంసూరు మండలంలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. మ ండల కేంద్రమైన వేంసూరులో అధికార పార్టీ నాయ కులు ఒక అభ్యర్థిని సర్పంచ్ స్థానానికి ప్రకటించగా.. కాంగ్రెస్ లోని మరో నాయకుడు సర్పంచ్ పదవికి రంగంలో ఉండనున్నారు. బీఆర్ఎస్ స్థానికంగా రెబల్ అభ్యర్థికి మద్దతు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మండలంలోని భీమవరం, మొద్దులగూడెం పంచాయతీల్లో సొంత పార్టీ అభ్యర్థుల మధ్యే పోటీ అనివార్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కల్లూరు మండలం మర్లపాడు, పేరువంచలలో అధికార పార్టీ నుంచే సర్పంచ్ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు తెలిసింది. పేరువంచలో బీఆర్ఎస్ మద్దతుతో మరో ప్యానెల్ రంగంలో ఉండే అవకాశం ఉండడంతో.. త్రిముఖ పోటీ అనివార్యమవుతుందని చెబుతున్నారు. తల్లాడ మండలంలోని మల్లవరంలో కాంగ్రెస్ నాయకుల మధ్యే పోటీ జరుగనుండడం.. ఒక వర్గానికి బీ ఆర్ఎస్ మద్దతు ప్రకటించంతో పోటీ అసక్తిగా మారబోతుంది. తల్లాడ, అన్నారుగూడెంలలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులకు అధికార పార్టీ నాయకులు కొందరు మద్దతు ప్రకటించారు. దీంతో అన్నారుగూడెంలో నలుగురు కాంగ్రెస్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్, మండలాపాడు గ్రామ పంచాయతీల్లో సొంత పార్టీ అభ్యర్థులే సర్పంచ్ స్థానంపై గురి పెట్టారు. రెబల్ నాయకులను బుజ్జగించేందుకు అధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగారు.


ఏకగ్రీవం దిశగా పంచాయతీలు

స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్ని పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి. ప్రాథమిక సమాచారం మేరకు తల్లాడ మండలం బస్వాపురంలో అన్ని పార్టీలు, వర్గాల ప్రజలు ఏకగ్రీవ ఎన్నికకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో ఒక్కొక్క గ్రామ పంచాయతీల్లోనూ, వేంసూరు మండలాల్లో రెండు గ్రామ పంచాయతీలలో ఏకగ్రీవ ఎన్నిక కోసం ప్రాథమిక చర్యలు కొలిక్కి వచ్చినట్లు తెలిసింది.

ఎన్నికల్లో ఎన్నెన్ని సిత్రాలో..

- గ్రామ పంచాయతీ ఎన్నికలకు దూరమైన అనేక మంది మాజీలు
- వార్డు సభ్యుడిగా ఓ జడ్పీటీసీ, సర్పంచ్
- సర్పంచ్ బరిలో మాజీ ఎంపీటీసీలు

అశ్వారావుపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రారంభమైన స్థానిక ఎన్నికలలో ఎన్నెన్నో చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. చంద్రుగొండ మండలంలో ఓ మాజీ జడ్పీటీసీ కొనకళ్ళ వెంకటరెడ్డి చంద్రుగొండ పంచాయతీ వార్డు సభ్యుడిగా, అశ్వారావుపేట మండలంలోని వేదాంతపురం సర్పంచ్ సోని శివశంకర్ వర ప్రసాద్ ఈసారి వార్డు సభ్యుడిగా నామినేషన్లు వేయడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. చంద్రుగొండ మాజీ ఎంపిపి గుగులోతు బాబు ఈసారి పోకలగూడెం సర్పంచ్‌గా నామినేషన్ వేయడం విశేషం. అశ్వారావుపేట మండలం నందిపాడు మాజీ ఎంపీటీసీ పండా రాజు, ములకలపల్లి మండలం, జగన్నాథపురం- 2 మాజీ ఎంపీటీసీ మడకం విజయ ఈ సారి రాచన్నగూడెం సర్పంచ్‌గా నామినేషన్ వేశారు. గతంలో నియోజకవర్గంలోని 105 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా పోటీ చేసిన వారిలో అతి కొద్దిమంది మాత్రమే ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. గతంలో అప్పులు పాలవ్వడం, ఆర్థికంగా వ్యయం ఎక్కువ కావడం, రిజర్వేషన్ల మార్పిడితో అనాసక్తి, మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 90శాతం మంది ఎన్నికలకు పూర్తిగా దూరంగా ఉండి పోయారు. అశ్వారావుపేట మండలంలో గాండ్లగూడెం మాజీ సర్పంచ్ భూక్య చిలకమ్మ స్థానంలో ఆయన భర్త ప్రసాదరావు, దిబ్బగూడెం పంచాయతీ మాజీ సర్పంచ్ కుంజా లక్ష్మి స్థానంలో ఆమె భర్త అర్జున్, కన్నాయిగూడెం సర్పంచ్ గొంది లక్ష్మణరావు మాత్రమే ప్రస్తుతం నామినేషన్లు వేసారు. అన్నపురెడ్డి మండలం, అన్నపురెడ్డిపల్లి పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ బోడ పద్మ మరలా బరిలో ఉన్నారు. చంద్రుగొండ మండలం చంద్రుగొండ తాజా మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణీ మరలా పోటీ చేస్తున్నారు. ములకలపల్లి మండలంలో మాదారం సర్పంచ్‌గా తాజా మాజీ సర్పంచ్ వాడే నాగరాజు బార్య కళ్యాణి, జగన్నాధపురం తాజా మాజీ గడ్డం భవాని స్థానంలో భర్త నతానియేల్ పోటీ చేస్తున్నారు. దమ్మపేట సర్పంచ్ బీఆర్ఎస్ అభ్యర్థి దారా రోహిణి గతంలో ఎంపీటీసీగా చేశారు. కాంగ్రేస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పడగాల రమాదేవి భర్త గతంలో వార్డు సభ్యుడిగా ఉన్నారు. జమేదార్ బంజర్ పంచాయతీలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా తాజా మాజీ సర్పంచ్ సుగుణ భర్త ప్రసాద్ పోటీ చేస్తున్నారు. నాచారం పంచాయతీలో తాజా మాజీ సర్పంచ్ వెంకన్న పోటీలు ఉన్నారు. ఈ మండలంలో ఈ విధంగా పలువురు తాజా మాజీలు రంగంలో ఉన్నారు.



ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్





వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్.. మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించా లని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పంచా యతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరే ట్ నుంచి ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అలాగే భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎన్నికల పరిశీలకులు సర్వేశ్వర్ రెడ్డి, వ్యయ పరిశీలకులు లావణ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మీ పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉప సర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్లపై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఉప సర్పంచ్ ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని, ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పోస్టులకు సంబంధించి ఫలితాలు నిబంధనల ప్రకారం ప్ర కటించాలన్నారు. అనంతరం అధికారులతో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పనిసరిగా అర్హులకు పోస్టల్ బ్యాలెట్ అందించాలన్నారు. ప్రతీ గ్రామం, మండలాల వారీగా వివరాలు సేకరించి రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేలా చూడాలని అన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటు హక్కు ఉండి ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 8 వ తేదీన, రెండవ విడత వారికి 12న, మూడవ విడత వారికి 15వ తేదీన ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్ నియమించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, సీపీవో ఏ. శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైరా-జగ్గయ్యపేట రూట్‌లో పాలడుగు - సీతానగరం గ్రామాల మధ్య ఉన్న రోడ్డు

అటూ.. ఇటూ!

- ఒకే రోడ్డుకు ఇరువైపులా పాలడుగు- సీతానగరం పంచాయతీలు
- నియోజకవర్గాలు మారడంతో ఆసక్తికరంగా మారిన పోరు
- డిప్యూటీ సీఎం ఇలాకాలో ఉన్న రెండు గ్రామ పంచాయతీలు

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒకటే రోడ్డుకు ఇరువైపులా రెండు మండలాల పరిధి లో గ్రామ పంచాయతీలున్నాయి. వైరా-జగ్గయ్యపేట, మధిర ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వైరా-బోనకల్ మండలాల పరిధిలోని రెండు గ్రామ పంచాయతీలున్నాయి. అవే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలానికి చెందిన సీతానగరం పంచాయతీ, వైరా మండలంలోని పాలడుగు పంచాయతీలుగా ఉన్నాయి. సీతానగరం పంచాయతీ మైనర్‌గా ఉంది. పాలడుగు పంచాయతీ దానికి రెండింతల పెద్దదిగా ఉంది. ఈ రెండు పంచాయతీల మధ్య ఉన్న వైరా-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు మొత్తం బోనకల్ మండలం పెద్దబీరవల్లి రెవెన్యూ పరిధిలో ఉంది. ఆ రెవెన్యూ శివారు గ్రామమే సీతానగరం. 2019కు ముందు సీతానగరం జానకీపురం పంచాయతీ పరిధిలో శివారు గ్రామంగా ఉంది. సీతానగరం ప్రజలు జానకీపురం వెళ్లి పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో కొత్త పంచాయతీలను ఏర్పాటుచేసిన నేపథ్యంలో జానకీపురం పంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన సీతానగరం పంచాయతీగా ఏర్పడింది. దాంతో ఒకే రోడ్డుకు ఇరువైపులా పాలడుగు-సీతానగరం పంచాయతీలుగా ఉన్నాయి. నిత్యం ఈ రెండు పంచాయతీల పరిధిలోని ప్రజలు ఈ రోడ్డు నుంచే రాకపోకలు, మిగిలిన అవసరాలను వినియోగించుకుంటున్నారు. ఈ రోడ్డు సీతానగరం పరిధిలో ఉన్నప్పటికీ పాలడుగుగానే గుర్తింపు ఉంది. ఈ పాలడుగు పంచాయతీ పరిధిలో 1651ఓట్లు ఉన్నాయి. మొత్తంగా రెండు పంచాయతీలకు ఒకే రోడ్డు అనుసంధానంగా ఉంది. సీతానగరం మధిర నియోజకవర్గంలో, పాలడుగు వైరా నియోజకవర్గ పరిధిలో ఉండటం విశేషం.

కోతుల బెడదను నివారిస్తే.. మా ఓటు మీకే

● మాదారం యువకుల డిమాండ్ ● గ్రామ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటు

ములకలపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నెలకొన్న కోతుల బెడదను నివారించిన వారికే తాము ఓటు వేస్తామని ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువ కావడంతో పంటలన్నీ నాశనం చేస్తున్నాయని ఈ సందర్భంగా గ్రామ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయ, పింద దశలోనే అన్ని పంటలను కొరికి పడేస్తున్నాయన్నారు. అదే విధంగా గ్రామంలో కోతులు నానా బీభత్సం సృష్టిస్తున్నాయన్నారు. ఓ వైపు రైతులు తీవ్రంగా నష్టపోతుండడం.. మరోవైపు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా.. ఎవరైతే కోతులను అరికడతామని హామీ ఇస్తారో వారికి ఓటు వేస్తామని ఆ గ్రామ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు ఆ గ్రామ ప్రధాన కూడళ్లలో యువకులు తాండ్ర నాగబాబు, మిరియాల నిశాంత్, ఉప్పు నీతిరాజు, గడప నరసింహారావు, నారం నవీన్, కొంగల శివలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి.



మాదారంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీతో గ్రామ యువకులు

అమ్మ కోసం.. కెనడా నుంచి..

- సర్పంచ్ బరిలో నిలిచిన తల్లి
- గెలిపించే లక్ష్యంతో స్వగ్రామానికి వచ్చిన కుమారుడు



విమానాశ్రయంలో ప్రేమ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న కుటుంబసభ్యులు

చింతకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ బరిలో నిలిచిన తన తల్లి కోసం కెనడా నుంచి స్వగ్రామానికి వచ్చారు ఓ కుమా రుడు. తాను ఓటేయడంతో పాటు గ్రామంలోని ఓటర్లకు తన తల్లి పోటీచేస్తున్న లక్ష్యాన్ని వివరించేందుకు ఆయన నడుం బిగించారు. ఈ క్రమంలో కెనడా నుంచి స్వదేశానికి చేరుకున్న ఆ కుమారుడికి కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి వేదికైంది ఖమ్మం జిల్లా చింతకాని మండలం అనంతసాగర్ గ్రా మం. అనంతసాగర్‌కు చెందిన పత్తిపాటి ప్రేమ్‌కుమార్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ఆయన తల్లి పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ సర్పంచ్ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచారు. ఈ క్రమంలో ఆమెను గెలిపించడమే లక్ష్యంగా ప్రేమ్‌కుమార్ తన ఉద్యోగానికి సెలవులు పెట్టి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మా ట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా పేదలకు సేవ చేయడం, గ్రామాభివృద్ధే లక్ష్యంగా తన తల్లి ఎన్నికల్లో పోటీ చేస్తోందని, ఓ కొడుకుగా ఆమెకు అండగా నిలబడేందుకు తాను స్వగ్రామానికి వచ్చినట్లు తెలిపారు. సుమారు 1800ఓట్లున్న ఈ గ్రామం ఎస్సీ మహిళకు రిజర్వ్ అవగా మొదటివిడతలో ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల్లో ఘర్షణలకు తావివ్వొద్దు

- పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- ఖమ్మం సీపీ సునీల్ దత్



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్

ఖమ్మం క్రైం, డిసెంబరు 4 : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు స్టేషన్ సెక్టార్ అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తుపై సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా.. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునేలా పోలీసు యంత్రాంగం పని చేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను బైండోవర్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం విక్రయాలు జరిపే బెల్ట్ షాపులను కట్టడి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన పిన్ని, కూతురు

లక్ష్మీదేవిపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగళ్ల గ్రామ పంచాయతీలో ఒకే కుటుంబానికి చెందిన పిన్ని, కూతురు సర్పంచ్ పదవులకు పోటీ పడుతూ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పంచాయతీ ఎస్టీ మహిళ కోయ రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మలకం సౌందర్య తన బాబాయి భార్య అయిన మలకం లక్ష్మీ (పిన్ని)తో ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమైంది. అలాగే మలకం లక్ష్మీ (పిన్ని) సీపీఐ మద్దతుతో పోటీలోకి దిగారు.



మలకం లక్ష్మీ



సౌందర్య



ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితోనే ఏకగ్రీవాలు

డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే జిల్లాలో గణనీయంగా ఏకగ్రీవ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు,వార్డుసభ్యుల ఏకగ్రీవానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏకగ్రీవ పంచాయతీల్లో ఉపసర్పంచుల ఎన్నిక

రఘునాథపాలెం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో ఏకగ్రీవ గ్రామ పంచాయతీల్లో గురువారం ఉపసర్పంచ్‌ల ఎన్నిక నిర్వహించారు. మండల కేంద్రం రఘునాథపాలెం గ్రామ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనప్పటికీ రెండు వార్డులకు ఎన్నికలు జరగనుండటంతో ఉపసర్పంచ్ ఎన్నిక జరగలేదు. మిగిలిన నాలుగు పంచాయతీల్లో ఎన్నికల అధికారులు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. రేగులచలక ఉపసర్పంచ్ గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నున్నా వెంకటేశ్వర్లు, రాములుతండా ఉపసర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుగులోతు మానస, మంగ్యాతండా ఉపసర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుగులోతు నాగేశ్వరరావు, మల్లేపల్లి పంచాయతీ ఉపసర్పంచ్‌గా బండి వెంకన్న ఎన్నికయ్యారు. మల్లేపల్లి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన అభ్యర్థిని వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, నల్లమల్ల ఆనంద్ అభినందించారు.



మల్లేపల్లి ఉప సర్పంచ్‌ను అభినందిస్తున్న సైదుబాబు

సమన్వయంతో పని చేయాలి

ఏడీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంరఘునాథపాలెం,డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు సమన్వయంతో పని చేసి, పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని అడిషనల్ డీసీపీ లా అండ్‌ఆర్డర్ ప్రసాద్‌రావుఅన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల పురస్కరించుకొని ఖమ్మం డివిజన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం రఘునాథపాలెం మండలంలో ఎన్నికలకు నామినేషన్ వేసిన సర్పంచులు, వార్డ్ సభ్యుల అభ్యర్థులతో గణేష్ గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్రఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమని, స్థానిక ఎన్నికలను అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం జరుగుతుందని, కాబట్టి ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకులోనుకాకుండా సద్వినియోగం చేసుకునే వాతావరణాన్ని కల్పించడం పోలీస్‌శాఖ ప్రధాన బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీఐఉస్మాన్‌షరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ ప్రసాద్‌రావు

ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

» రఘునాథపాలెం మండలంలో ఊపందుకున్న ప్రచారం
» మండల అభివృద్ధిపై మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి

రఘునాథపాలెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలో 37పంచాయితీలకు 5పంచాయతీలు ఏకగ్రీవంకాగా, రఘునాథపాలెం గ్రామంలో సర్పంచ్‌తోపాటు 8వార్డులు ఏకగ్రీమయ్యాయి. రెండువార్డులకు, మిగిలిన 32 పంచాయితీలలో సర్పంచ్, వార్డుసభ్యులకు ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజున ఫలితం వెలువడనుంది.బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం గుర్తులను కేటాయించారు. 32పంచాయితీలలో మొత్తం 113 మంది సర్పంచ్ అభ్యర్థులు, మొత్తం 308 వార్డులకుగాను 163వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 145 మంది వార్డు సభ్యులు పోటీలో ఉన్నారు. గుర్తులను చూపుతూ గురువారం నుంచి సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు అభ్యర్థులు గురువారంనుంచే దావతులు ప్రారంభించారు. ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. ఉప సంహరణల అనంతరం ఐదుగ్రామ పంచాయితీల నుంచి సర్పంచ్ స్థానానికి ఒకే నామినేషన్ ఉండటంతో ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. కాగా రఘునాథపాలెం పంచాయతీకి గాజుల కృష్ణారావు, రేగులచలక గ్రామానికి యండపల్లి రమాదేవి, రాములుతండా పంచాయతీకి బానోతు వెంకట్రామ్, మల్లేపల్లికి తేజావత్ బద్రి, మంగ్యాతండాకు మాలోతు భార్గవి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవ పంచాయితీలకు నజరానాలు

మండల పరిధిలో 5పంచాయతీలు ఏకగ్రీవం కాగా వాటికి ప్రభుత్వం తరుపున ఆర్థికంగా నజరానాలు అందనున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏకగ్రీవ పంచాయితీలతోపాటు ఎన్నికలు జరిగే పంచాయితీలలో అభివృద్ధే ధ్యేయంగాప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నారు.పల్లెలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో నిధులను అధికంగా మండలానికి మంజూరు చేస్తూ అభివృద్ధిలో ముందుంచుతున్నారు. ఎన్నికలు జరిగే పంచాయతీల్లో అధికంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తారని తెలుస్తోంది. గ్రామాల అభివృద్ధి కావాలంటే అధికారంలో ఉన్న ప్రభుత్వం వల్లనే జరుగుతుందనే భావనతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.



మాలోత్ భార్గవి(మంగ్యాతండా),యండపల్లి రమాదేవి(రేగులచలక),బానోత్ వెంకట్రామ్(రాములుతండా), గాజుల కృష్ణారావు(రఘునాథపాలెం), తేజావత్ బద్రి(మల్లేపల్లి)

రూరల్ మండల బరిలో 119 మంది సర్పంచులు.. 29 మంది నామినేషన్ల తిరస్కరణ

ఖమ్మంరూరల్: మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ పదవికి మొత్తం 148మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వార్డు మెంబర్లకు మొత్తం 574 మంది నామినేషన్లు వేశారు. అయితే బుధవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో 29 మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో మొత్తం 119 మంది బరిలో ఉన్నాయి. వార్డు మెంబర్లకు సంబంధించి 574 మందిలో 18మంది నామినేషన్లు తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో 556మంది బరిలో ఉన్నారు. శనివారం నామినేషన్ల ఉపసంహరన అనంతరం బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించనున్నారు.

ఖర్చు నుంచి ఎలా గట్టెక్కాలి?

» పంచాయతీ ఎన్నికల అభ్యర్థుల్లో జంకు
» గ్రామస్థాయిని బట్టి రూ.5లక్షలు నుంచి 30లక్షలు
» పోటీలో ఉండాలా వద్దా అనే మీమాంసలో అభ్యర్థులు

కూసుమంచి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్లపర్వం పూర్తయింది. సర్పంచి, వార్డుసభ్యుల నామినేషన్ల పర్వం పూర్తికావడంతో అభ్యర్థులు ఇక ప్రచారానికి సమాయత్తం అవుతున్నారు.నామినేషన్ల పరిశీలన అనంతరం 6తేదీ శనివారం ఉపసంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అయితే ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతున్నప్పటికీ.. బలపరుస్తున్న ఆయా పార్టీల నేతల హడావుడి భారీగానే ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఖర్చు ఎలా అని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక వర్గంతో పాటు, ఆర్థికంగా బలం ఉన్న అభ్యర్థులనే దాదాపు వెతికి బరిలో నిలిపినప్పటికీ అంత ఆఖర్చు భరించగలమా..? ఎలా గట్టెక్కాలి.. అంటూ ఆలోచనలో పడ్డారు. ఇదివరకే సర్పంచ్ పదవికి పోటీచేయాలని అనుకున్న ఆశావాహులు, రిజర్వేషన్లు అనుకూలించినా అయ్యే ఖర్చు భరించగలమా.. పోటీచేయాలా లేక విరమించుకోవాలా.. అనే మీమాంసలో ఉన్నారు.

ఖర్చు తట్టుకునేదెలా..?

నామినేషన్లు పూర్తయినందున ఇక పోలింగ్‌రోజువరకు ప్రచారఖర్చు, కార్యకర్తలకు భోజనాలు, మద్యం వరకు భరించాల్సి ఉంటుంది. అయితే ప్రచారానికి రోజుకు కూలీ ఇచ్చి జనాన్ని రప్పించాల్సి ఉంటుంది. భోజనాలు, మద్యం, కూలీ ఇతరత్రా ఖర్చు అంచనా వేసుకున్న నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఖర్చు రు.5లక్షల పైమాటే

గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలంటే చిన్నపంచాయతీల్లో కనీసం రు.5లక్షల పెద్దగ్రామాల్లో రూ.10 లక్షలు పైమాటే ఖర్చవుతంది. అదేవిధంగా జనరల్ గ్రామాల్లో సుమారు 3నుంచి 4వేల ఓట్లు ఉన్న పంచాయతీల్లో రూ.30లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనావేస్తున్నారు. ఆదాయం ఎక్కువగా వచ్చే కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెం, నేలకొండపల్లి మండలంలోని నేలకొండపల్లి వంటి గ్రామాల్లో రు.30లక్షల ఖర్చు తప్పదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత కాలం సర్పంచ్ పదవికోసం ప్రజలతో మమేకమైన నాయకులు అంతఖర్చు చేయాలా వద్ద అనే ఆలోచనలో పడ్డారు. కొందరు ఇప్పటికే తమ ఆస్తులను తాకట్టుపెట్టి డబ్బు సమకూర్చుకునే ప్రయత్నంలో ఉన్నారు.

జాతీయ రహదారులకు నిధులు కేటాయించాలని వినతి

ఖమ్మంమార్కెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోపెండింగ్‌లోఉన్న జాతీయ రహదారులకు వెంటనే నిధులు కేటాయించాలని రాజ్యసభ ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర విన్నవించారు. గురువారం ఢిల్లీలో కేంద్రరోడ్డురవాణా, జాతీయ రహదారులశాఖామంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందించారు. నిర్మాణ దశలో ఉన్న రహదారులను పూర్తి చేయాలని కోరారు.



గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న వద్దిరాజు

దత్తాత్రేయ మందిరం ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): శ్రీదత్తాత్రేయ స్వామి వారి జయంతి సందర్భంగా గురువారం శ్రీ గురుపాదుకా పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా దత్తాత్రేయస్వామి వారి మందిరం ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఉరిమెళ్ళ కృష్ణ ప్రసాద్, లక్ష్మీ దంపతులచేత నిర్వహించారు. సామూహిక ఉచిత అనఘాష్టమి వ్రతాలు, గోమాత పూజ,దత్తాత్రేయస్వామి వారి నామస్మరణ, లక్ష్మీగణపతి దత్తాత్రేయ స్వామి హోమాలు, స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నప్రసాద వితరణ జరిపారు.ఈకార్యక్రమంలో శ్రీగురుపాదుకా పీఠం ట్రస్ట్‌చైర్మన్ దంపతులు ఉరిమెళ్ళకృష్ణ ప్రసాద్, లక్ష్మి, ట్రస్టీలు 37వడివిజన్ కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, షేక్ ముక్తార్, వికాస తరంగిణిసేవా సమితి అధ్యక్షులు పోలా.శ్రీనివాస్,గ్రూపు సభ్యులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్లాస్టిక్ రహిత ఖమ్మానికి అందరూ సహకరించాలి

» డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌రహిత ఖమ్మం ఏర్పాటుకు వీధి వ్యాపారుల నుంచి కమర్షియల్ వ్యాపారుల వరకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని, పర్యావరణహితమైన జీవవిలయ కవర్లుతో అమ్మకాలు జరపాలని కేఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మార్కెట్ ఈవో శివరామకృష్ణ సూచించారు. పర్యావరణ హితమైన కవర్లు మాత్రమే వ్యాపారాలకు వినియోగించాలని సూచించారు. గురువారంనగరంలో వీధివ్యాపారుల మార్కెట్, వైరారోడ్డు, ప్రధాన రహదారుల్లోని కమర్షియల్ ప్రాంతాల్లో ప్లాస్టిక్‌కవర్లును నిర్మూలించాలని, పర్యావరణ హితమైన కవర్లును మాత్రమే వినియోగించాలని కోరారు. నిషేధిత కవర్లు మార్కెట్‌లో కేజీ రూ.110ధర ఉండగా పర్యావరణ హితమైన కవర్లు కేజీ 150నుంచి170వరకు అందుబాటు ధరలో ఉన్నాయని అవగాహన కల్పించారు.పర్యావరణహితమైన కవర్లు రెండు నుంచిమూడు నెలల్లో భూమిలో కలిసి పోతాయని పర్యావరణహాని కలగదన్నారు. అవగాహన కల్పించిన తర్వాత కూడా ప్లాస్టిక్ కవర్లు ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తేకఠినమైన జరిమానాలు విధిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, శానిటీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవాన్ కుక్కల నాగరాజు పాల్గొన్నారు.



పర్యావరణ హితమైన కవర్లపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

ప్రారంభానికి సిద్ధమవుతున్న తెలంగాణ తల్లి విగ్రహం

పనులను పరిశీలించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణంలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ మేరకు గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విగ్రహ నిర్మాణం పనులను పరిశీలించారు. మరింత ఆకర్షణీయంగా దీన్ని తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్ర సాంస్కృతిక చిహ్నమైన తెలంగాణతల్లి విగ్రహాన్నికలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులు చివరి దశకు చేరకున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 33 జిల్లాలో కలెక్టరేట్ ఆవరణంలో విగ్రహాలు ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో ఉండే తెలంగాణ తల్లి విగ్రహం తరహాలోనే 12 అడుగుల పీఠం, 2 అడుగుల దిమ్మె, 4 అడుగులతో కలిపి మొత్తంగా 20 అడుగులు ఎత్తులో కలెక్టరేట్‌లో విగ్రహం ఉంటుందన్నారు. సబ్బండ వర్గాల ఆకాంక్షలకు స్పూర్తిగా సంప్రదాయ పల్లెటూరి మహిళా రైతుగా శ్రీమూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారన్నారు. వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు తెలంగాణ తల్లి విగ్రహం మరింత ఆకట్టుకుంటుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కేఎంసీలో దళారీ వ్యవస్థపై నిఘా

» చిన్నచిన్న పనులకు సైతం భారీగా డబ్బులు గుంజుతున్న ప్రైవేట్ వ్యక్తులు
» ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించిన కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో దళారుల ఆగడాలను అడ్డుకట్ట వేసేందుకు కమిషనర్ చర్యలు చేపట్టారు. నిత్యం జనన, మరణ ధ్రువపత్రాల నుంచిఆధార్‌లో పేరు మార్పులు చేర్పుల వరకు పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు వస్తున్నారు.వారిలో ఎక్కువ మంది నిరక్షరాస్యులు, వృద్ధులు ఉండటంతో వారిని క్యాష్ చేసుకునేందుకు కేఎంసీ కార్యాలయం గేటు బయట దళారీ వ్యవస్థ ఎన్నో ఏళ్లుగా ఉంది. కేఎంసీ కార్యాలయానికి అనుబంధంగా మీసేవా కేంద్రం అందుబాటులో ఉండటంతో మీసేవా కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. దీంతో కేఎంసీ ఎదుట ఆరుగురు వ్యక్తులు దరఖాస్తులు రాస్తామంటూ ఉంటున్నారు. కొద్దిపాటి డబ్బులు ఇస్తే దరఖాస్తు రాస్తామని దరఖాస్తులు రాయటం ప్రారంభిస్తున్నారు.విషయాన్ని గమనించి బేరాలు సాగిస్తున్నారు. మీరు స్వయంగా వెళ్తే ఏడాది పడుతుంది. మాద్వారా అయితే వెంటనే పనైపోతుందని నమ్మబలుకుతున్నారు. ఇటీవల ఆధార్‌లో పేరు తప్పులు సరిచేసేందుకు ఓదళారీ రూ.10వేలు అడగటం కేఎంసీలో చర్చనీయాంశంగా మారింది. విషయం వెలుగులోకి రావటంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. కొన్ని రకాల ధ్రువపత్రాలకు లాయర్ నోటరీ అవసరం లేదని బహిరంగ ప్రకటన విడుదల చేశారు. కేఎంసీ కార్యాలయం గేటు ఎదుట ప్రైవేట్ వ్యక్తులు, దళారులు దరఖాస్తులు రాయకుండా నిఘాను ఏర్పాటు చేశారు. దీంతో గతంలో ఆరుగురు ఉన్న దళారులు ఇప్పుడు ముగ్గురుకు తగ్గారు. వారిని కట్టడి చేసేందుకు అవసరమైతే పోలీసు కేసులు పెట్టేందుకు కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పర్యవేక్షణ పెంచారు. దళారులను ఆశ్రయించకుండా పారదర్శకంగా కేఎంసీ సేవలు అందిస్తామని అధికారులు ప్రకటించారు.

పాలియేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ హస్పిటల్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్ (ఉపశమన సంరక్షణ కేంద్రం) ను జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డి.రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా పాలియేటివ్ కేర్‌లో ఇన్‌పెషేంట్లుగా ఉన్న వారితో మాట్లాడి అందుతున్న సేవలు, సిబ్బంది రోగులపట్ల చూపిస్తున్న ఆదరణ గురించి తెలుసుకున్నారు. వైద్యసేవలు, శారీరక ఉపశమనతో పాటు మానసిక ప్రశాంతతను అందించడం కోసమే ఈకేంద్రాల అవసరమన్నారు. అక్కడి వైద్యులు, సిబ్బంది విధుల్ని, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎన్సీడీ క్లీనిక్, కీమోతెరపి వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్యులతో పేషంట్లకు ఓపీలో అందుతున్న సేవలు, సదుపాయల గురించి చర్చించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌ను సందర్శించి శాంపిల్ కలెక్షన్, టెస్టింగ్, ల్యాబ్‌రిజల్ట్, రికార్డ్స్, రిజిస్టర్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. సిబ్బంది క్రమశిక్షణతో పాటు సమయపాలన పాటించాలని, ఆధార్ బేస్డ్ అటెండెన్స్ అందరూ తప్పక వేయాలన్నారు.పరిసరాలను,పేషంట్లవెయిటింగ్ హాల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో సూపరింటెండెంట్ నరేందర్, డాక్టర్ రిషిత, డాక్టర్ అనూష నర్సింగ్ ఆఫీసర్ సుజాత, ల్యాబ్ టెక్నీషియన్ రత్నం, ఫార్మసీ ఆఫీసర్ మన్మధరావు, కౌన్సిలర్ మక్బూల్ పాష , ఎన్సీడీ జిల్లా కో ఆర్డినేటర్లు సత్యనారాయణ, పులి మురళి తదితరులున్నారు.



రోగులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

ఖమ్మంఅర్బన్,డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఐద్వా ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా ఖమ్మం డివిజన్అధ్యక్ష కార్యదర్శులు బాగం అజిత,పత్తిపాక నాగసులోచన పిలుపునిచ్చారు. గురువారం జరిగిన త్రీటౌన్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. మహిళా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

10నుంచి బాలోత్సవం

ఖమ్మంఅర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యాలయం పక్కనగల మంచికంటి హాల్‌లో ఈనెల 10నుంచి 12 వరకు బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్. నాగేశ్వరరావు, వై. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, ఫ్యాన్సీ డ్రెస్, వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, పాటల, నృత్యాల పోటీలను సబ్ జూనియర్స్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో నిర్వహిస్తామన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ


వాహనదారుడు దుర్మరణం

ఖమ్మంరూరల్, డిసెంబరు4(ఆధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, కాచిరాజుగూడెం ప్రాంతంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, బలపాల గ్రామానికి చెందిన మునగాల వీరభద్రం (40) ద్విచక్రవాహనంపై రెడ్డిపల్లిలోని బంధువుల ఫంక్షన్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గంమధ్యలో కాచిరాజుగూడెం గ్రామం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వీరభద్రం అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నం శ్రీనివాస్ సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూముల ఆక్రమణను ఉపేక్షించొద్దు

(5వ పేజీ తరువాయి)

జంతువులవేటకు పాల్పడిన, అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నించినా గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీప్రాంతంలో పోడు భూముల్లో 11కేవీలైన్లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీలాద్రి అర్బన్ పార్క్ పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్క్ కాంపౌండ్ దూకి రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని, పార్క్ కాంపౌండ్ వాల్ ఎత్తును వీలైనంత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఆర్‌వో దగ్గర ఉండి అవసరం మేరకు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకుడు విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, వ్యవసాయ, హార్టికల్చర్, అగ్నిమాపక, విద్యుత్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పంచాయతీరాజ్, గ్రౌండ్ వాటర్, సింగరేణి అధికారులు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వోలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

లారీని ఢీ కొట్టిన పాఠశాల బస్సు

విద్యార్థికి స్వల్ప గాయం

ఖమ్మంక్రైం, డిసెంబరు4:లారీడ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్‌వేయడంతో వెనుక నుంచి స్కూల్‌బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటన గురువారం ఉదయం ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకొని రాపర్తి నగర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వైపు వెళుతుంది. ఈ క్రమంలో ఆర్టీవో ఆఫీస్ సమీపంలో రాగేనే రోడ్డు క్రాస్ చేస్తూ ఓ ఆటో వెళ్లడంతో లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో స్కూల్ బస్సు లారీని వెనుక ఢీకొట్టింది.ఈప్రమాదంలో స్కూల్‌బస్ ముందు అద్దం ధ్వంసమైంది. బస్సులోని ఓవిద్యార్థికి స్వల్పగాయమైంది. విషయం తెలిసిన ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. విద్యార్థులను మరో బస్‌లో స్కూల్‌కు తరలించారు.

కబడ్డీ జట్టుకు కిట్ల పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో నేటినుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయికబడ్డీ పోటీల్లో పాల్గొనే జూనియర్ కబడ్డీ జట్టుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కిట్లు సమకూర్చారు. గురువారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కార్యాలయం ఇన్‌చార్జీ దయాకర్‌రెడ్డి కిట్లును క్రీడాకారులను పంపిణీ చేశారు. విజయ స్ఫూర్తితో ఆడి ఖమ్మానికి కప్పుతో తిరిగి రావాలని కోరారు.కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టాఫర్ బాబు పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి



15వ బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ పెదబాబు

నామినేషన్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

అన్ని సౌకర్యాలు కల్పించాలి: అదనపు కలెక్టర్ శ్రీజ



అధికారులతో మాట్లాడుతున్న శ్రీజ

కారేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న మూడవవిడత స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన పలు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి ఆమె స్థానిక మండల అధికారులను అడిగితెలుసుకున్నారు. నామినేషన్ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, పలలు గ్రామలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభ్యర్థితోపాటు ఇద్దరికే అనుమతి: ఏసీపీ



కేంద్రం వద్ద ఏసీపీ వసుంధర

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ వేయడానికి అభ్యర్థితోపాటు ఇద్దరు మద్దతుదారులకు మాత్రమే నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని కల్లూరు ఏసీపీ పీ.వసుంధర యాదవ్ అన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికల 2వ దఫా నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రుద్రాక్షపల్లి, గంగారం, బేతుపల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఉన్నారు.

కేంద్రాలను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్



ముత్తగూడెం నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని గురువారం సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ సందర్శించి తనిఖీ చేశారు. అలాగే స్థానిక కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వద్ద అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు, అలాగే ముగ్గు వెంకటాపురంలోని నామినేషన్ కేంద్రాన్ని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్యేక నిఘాలో పోలీసు పహారా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

పెనుబల్లి: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ముత్తగూడెంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఏఎస్ఐ సత్యనారాయణ, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



గొల్లపూడిలో పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బంది

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో గురువారం వైరా ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గొల్లపూడి, పాలడుగు, అష్టగుర్తి గ్రామాల్లో పోలీసు వాహనాల సైరన్లతో పెట్రోలింగ్ చేసి గ్రామాల ప్రజలతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఘర్షణల దృష్ట్యా ముందుగానే పోలీసులు అన్ని జాగ్రత్తలు చేపట్టారు. సెక్టార్ అధికారి అయిన ఎస్ఐ పవన్, ఏఎస్ఐ ఏసు పాల్గొన్నారు.

పరిపాలనలో రోశయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు విలక్షణ సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య పరిపాలనను స్ఫూర్తిగా తీసుకోవాలని 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. రోశయ్య వర్థంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని గంగారంలోని ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీదర్‌రాజా, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ కొండ్రా నర్సింహ ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ముసాయిదా, విత్తన, విద్యుత్ సంస్కరణల బిల్లులను రద్దు చేయాలి

- వైరా పర్యటనలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

ముదిగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముసాయిదా, విత్తన, విద్యుత్ సంస్కరణల బిల్లులను రద్దు చేయాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మచ్చా వీరయ్యభవన్‌లో జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8వతేదీన ఏఐకేఎస్ జాతీయ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారతదేశమంతటా ముసాయిదా, విత్తన, విద్యుత్ బిల్లులను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ బిల్లుల ప్రతులను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ విత్తన సార్వభౌమత్వాన్ని కొన్ని బహుళజాతి దేశీయ గుత్తాధిపతులకు అప్పగించాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ యొక్క కుట్ర అని విమర్శించారు. రైతులను పీడించి దోచుకోవడానికి అవసరమైన నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయని తెలిపారు. భారతదేశ యొక్క అంతర్జాతీయ నిబద్ధతలకు విత్తన రంగంలో సమతుల్యతను పెద్ద కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్నారని దుయ్యబట్టారు. ఈ బిల్లుల దగ్ధం కార్యక్రమంలో రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్య.కా.సం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు శోభన్, రాయల వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రసాద్, కందుల భాస్కర్ రావు, మందరపు వెంకన్న పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణను ఉపేక్షించొద్దు

(5వ పేజీ తరువాయి)

జంతువుల వేటకు పాల్పడిన, అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నించినా గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూముల్లో 11 కేవీ లైన్లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీలాద్రి అర్బన్ పార్క్ పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్క్ కాంపౌండ్ దూకి రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని, పార్క్ కాంపౌండ్ వాల్ ఎత్తును వీలైనంత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఆర్‌వో దగ్గర ఉండి అవసరం మేరకు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, వ్యవసాయ, హార్టికల్చర్, అగ్నిమాపక, విద్యుత్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పంచాయతీరాజ్, గ్రౌండ్ వాటర్, సింగరేణి అధికారులు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీపురం ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వైరా డివిజన్ ఏఈ పి.వెంకటసాయి తెలిపారు. శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్టేజీ పినపాక, సిరిపురం, పూసలపాడు, ముసలిమడుగు, ఖానాపురం, కొండకొడిమ, గండగలపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ సరఫరాలో ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని సూచించారు.

మధిరలో సర్పంచ్ పదవులకు 65మంది పోటీ



దేశినేనిపాలెం పంచాయతీ కార్యాలయం

మధిర రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని 27గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 65మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వివిధ గ్రామ పంచాయతీల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి.

మల్లారంలో ఇద్దరు, రొంపిమళ్లలో ఇద్దరు, జాలిముడిలో ఇద్దరు, రామచంద్రాపురంలో ఇద్దరు, సిరిపురంలో ముగ్గురు, వెంకటాపురంలో ఇద్దరు. మునగాల, వంగవీడు, నక్కలగరుబు, ఖాజీపురం, నిధానపురం, ఖమ్మంపాడు, చిలుకూరు, తొండలగోపవరం, అల్లీనగరం, మహదేవపురం, దేశినేనిపాలెం పంచాయతీల్లో ఇద్దరేసి అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఆత్కూరులో నలుగురు, మాటూరులో ముగ్గురు, రాయపట్నంలో నలుగురు, బయ్యారంలో నలుగురు, ఇల్లూరులో ముగ్గురు, నాగవరప్పాడులో ఐదుగురు చొప్పున బరిలో ఉన్నారు. ఇప్పటికే సిద్ధినేనిగూడెం(మర్లపాడు), సైదిల్లీపురం పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

దేశినేనిపాలెంలో వార్డులన్నీ ఏకగ్రీవం.. సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నికలు

మధిర మండలం దేశినేనిపాలెం గ్రామపంచాయతీలో 8వార్డులు ఉండగా అన్నీ ఏకగ్రీవమయ్యాయి. కేవలం సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వార్డులను చెరిసగం ఏకగ్రీవం చేసుకున్నాయి. ముందుగా సర్పంచ్ పదవి కాంగ్రెస్‌కు, ఉపసర్పంచ్ పదవి బీఆర్ఎస్‌కు ఇచ్చేలా గ్రామ పెద్దలు, ముఖ్యనాయకులు ఒప్పందం చేసుకున్నప్పటికీ నామినేషన్లు ముగింపు సమయంలో చివరి నిమిషంలో గ్రామంలో సురేష్ అనే వ్యక్తి సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశాడు. ఆతర్వాత పెద్దలు చర్చలు జరిపినప్పటికీ విత్‌డ్రా చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది.

సర్పంచ్‌లు సరే.. వార్డు సభ్యులేరీ..!



పెనుబల్లి పంచాయతీ కార్యాలయం

పెనుబల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 32గ్రామపంచాయతీలు, 290వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ పార్టీలు ప్రధానంగా ఉండగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలిపేందుకు ఆయా పార్టీల నాయకులు గడచిన వారంరోజులుగా అభ్యర్థుల వేటలో పడ్డారు. ప్రధాన పార్టీల నుంచి సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేయడం ఒక ఎత్తయితే వార్డు సభ్యుల ఎంపిక నాయకులకు కత్తిమీద సాములా తయారైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు కొంతమంది ముందుకు వస్తున్నారు. కానీ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కొంతమేరకు సర్పంచ్ అభ్యర్థులు దొరికినా, సీపీఎం, బీజేపీలకు మాత్రం అభ్యర్థులను ఎంపిక చేయడం పెనుభారంగా మారింది. కొన్ని గ్రామాల్లో బీజేపీ ఎంపిక చేసిన అభ్యర్థులను కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని బీజేపీ నాయకులు పోటీకి ఎలా సిద్ధం కావాలో తెలియక సతమతమవుతున్నారు. పలు గ్రామాల్లో అధికార పార్టీలోని సర్పంచ్ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొనడంతో కొంతమంది సర్పంచ్ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోంది. వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు మాత్రం ఎవ్వరరూ ముందుకు రావడం లేదు. వార్డుసభ్యుల పదవి కేవలం అలంకారప్రాయమే అవుతుందని, గెలిచిన తర్వాత సమావేశాల్లో సైతం తమకు గుర్తింపు ఉండదని వెనుకడుగు వేస్తున్నారు. బరిలోకి దిగిన తర్వాత ఎంతోకొంత సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుందనే భావనతో పోటీకి ముందుకు రావడం లేదు. దీంతోపాటు రిజర్వేషన్లు కూడా నాయకులకు తలనొప్పిగా మారాయి. వార్డు సభ్యుడితో పాటు ఇరువురు ప్రతిపాదకులకు కూడా ఇంటిపన్ను చెల్లించాల్సి వస్తుంది. దీంతో పూరిల్లు, రేకుల షెడ్లు ఉన్న వారిని ప్రతిపాదకులుగా ఎంపిక చేసుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితుల్లో సర్పంచ్ అభ్యర్థులను అయితే ఏదోవిధంగా ఎంపిక చేసుకున్నా... వార్డు సభ్యులను మాత్రం ఎంపిక చేసుకోవడం ప్రధాన పార్టీల నాయకులకు శరాఘాతంగా మారింది.

విద్యుత్ లైన్ నిర్మాణంపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పాలడుగు గ్రామస్థులు

వైరా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో నుంచి 33కేవీ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని నిరసిస్తూ ఆ గ్రామ ప్రజలు గురువారం ఆందోళన చేశారు. వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్ అండ్‌బీ రహదారిపై నిరసన తెలిపారు. గ్రామంలో నుంచి 33కేవీ లైన్ విద్యుత్ స్తంభాల నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. పాలడుగు సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు 33కేవీ విద్యుత్ లైన్లను గ్రామం మీదుగా వేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామానికి దూరంగా నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం



ఇరుముడులతో అయ్యప్పస్వాములు

కారేపల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం పలువురు అయ్యప్పస్వాములకు గురుస్వాములు ఇరుముడి దారుణ చేశారు. ఈ సందర్భంగా స్వాములతో పాటు ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు అన్నధాన కార్యక్రమం చేశారు. అయ్యప్ప స్వాముల కీర్తనలతో ఆ ప్రాంతం మారు మోగింది.

మేజర్ పంచాయతీల్లో రసవత్తర పోటీ

- నాయకులకు అగ్ని పరీక్షగా మారిన అభ్యర్థుల గెలుపు
- తక్కువ వ్యవధితో ఒత్తిడికి లోనవుతున్న పోటీదారులు
- ప్రచారాలకు అంతగా ఆసక్తి చూపని రైతులు

బోనకల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రదానంగా మూడు మేజర్ పంచాయతీల్లో ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల వరుస గ్రామాలు కావడంతో పాటు దాదాపు పది వేల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండల కేంద్రమైన బోనకల్‌తో పాటు మిగిలిన రెండు గ్రామాలల్లో గెలుపును అధికార పార్టీ అది నాయకులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు సమాచారం. ఎలాగైన పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరాలన్న సంకేతాలు అందడంతో స్థానిక నాయకులు వీటి పైనే దృష్టి సారించారు. మేజర్ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటే నాయకుల ఇమేజ్ అమాంతం పెరగనుండగా, ఒకవేళ పరాజయం పొందితే డ్యామేజ్ కూడ అదే స్థాయిలో ఉంటుందన్న చర్చ జోరుగా సాగుతుంది. ఎలాగైనా మూడు పంచాయతీల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు వ్యూహ రచన చేసే పనిలో నాయకులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా ఈ మూడు గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీలు, నాయకులు కూడ బలంగా ఉండటంతో వారు కూడ ఏ మాత్రం తగ్గేదేలే! అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. ముందుగానే అభ్యర్థులను ఖారారు చేసి ప్రచారంలోకి దించారు. ముష్టికుంట్లలో కాంగ్రెస్ అభ్యర్థిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఎం అభ్యర్థిగా షేక్ హస్సన్‌లు, బోనకల్ పంచాయతీలో కాంగ్రెస్ అభ్యర్థిగా భూక్యా మంగమ్మ, బీఆర్ఎస్ అభ్యర్థిగా బాణావతు జ్యోతి, రావినూతలలో కాంగ్రెస్ అభ్యర్థిగా భూక్యా భద్రు నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా ముడావత్ సైదాలు బరిలో ఉన్నారు. అభ్యర్థులంతా రాజకీయ చతురతతో పాటు అంగ, అర్థ బలం ఉన్న వారు కావడంతో మూడు గ్రామాల్లో పోటీ రంజుగా మారింది. గుర్తులు కేటాయించిన తరువాత పోలింగ్‌కు కేవలం 6 రోజుల వ్యవది మాత్రమే ఉండటంతో పోటీదారులు తీవ్ర వత్తిడికి లోనవుతున్నారు. రైతులంతా మక్క సాగు పనుల్లో నిమగ్నం కావడంతో ప్రచారాలకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అభ్యర్థులు మాత్రం ఇంటింటా ప్రచారం చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు: డీఎం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుందని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం సునీత అన్నారు. నవంబర్ నెలలో అత్యధిక ఈపీకే, కేఎంపీఎల్, అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన ఉద్యోగులకు గురువారం డిపో గేట్ వద్ద ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను ఆమె చేతులమీదుగా అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ పరిరక్షణతో పాటు లాభాలు గణించేందుకు పనిచేస్తూ ఉత్తమ సేవలందించాలని కోరారు. 90శాతం ఓఆర్ సాధించేలా అందరూ కష్టపడి పనిచేయాలని, సంస్థ లక్ష్యాలను సాధించేందుకు అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని స్పష్టం చేశారు. అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, సూపర్‌వైజర్లు బాలస్వామి, కృష్ణారెడ్డి, ఆనందం, కాంతారావు, జాకబ్, అప్పారావు పాల్గొన్నారు.

స్థానిక సమరం.. గ్రామాల్లో మందు, విందుల సందడి

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నిల నేపద్యంలో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు మందు, విందు భోజనాలతో ఓటర్లను ప్రలోభాలు పెడుతున్నాయి. మండలంలో నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనందున, ఇప్పటికే పలు గ్రామాల్లో సర్పంచు ఎన్నికల్లో ఆధ్యిపత్య పోరును తలపించేలా ప్రధాన పార్టీలు విందు, మందు, ముక్క పసందుగా నిర్వహించి గ్రామాల వారిగా ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని సమాచారం. నామినేషన్ ప్రకియకు రెండు రోజుల ముందుగానే విందు పార్టీలకు ప్రధాన రాజకీయ పార్టీలు తెరలెపినాయి. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో రాజకీయంగా తమ ఆదిపత్యాన్ని నెలబెట్టుకునేందుకు ఈ విందు పార్టీలతో సర్పంచు బరిలో ఉండే పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు అడుగులు వేస్తున్నారు., మండంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగిన విందు భోజాలకు సుమారు 1000 మందిపైగా ఓటర్లను ఆయా పార్టీల అభ్యర్థుల అనుచరగణం ఆహ్వానించి పసందుగా విందులు ఇచ్చారు. నామినేషన్ల ఘట్టం ముగియక ముందే ఇదే పరిస్థితి ఉంటే ఇక ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల విజయం సాధించేందుకు ఓటర్లకు ప్రలోభాలకు గురి చేసేందుకు ఏ స్థాయిలో వ్యయం చేస్తారో అర్థమవుతుందిని చెప్పవచ్చు. ఇలా విందు పార్టీల్లో మద్యం సేవించే వారిని రహస్య స్థావరాల్లో పిలిచి ఆఫ్, ఫూల్ బాటిల్స్ (మందు) నజరాగా అందిస్తున్నారని సమాచారం. ఇలా ఎన్నికల సమయంలో విందు, మందు పార్టీలు కల్లూరు మండలంలో ప్రధాన రాజకీయ పార్టీల గెలుపే ధ్యేయంగా భావించి ఎంత ఖర్చుకైన వెనుకాడకుండా రోజు వారిగి మందు, విందు శిబిరాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనారిని తెలిసింది.



స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓ గ్రామంలో విందు భోజనాలు చేస్తున్న అనుచరులు

ఘనంగా మల్లు నందిని జన్మదిన వేడుకలు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మల్లు నందినికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

మధిర, డిసెంబబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని జన్మదిన వేడుకలు గురువారం మధిరలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల మధ్య ఆమె కేక్‌కట్ చేసి వారికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా బంజారా కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడే జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. వృద్ధాశ్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్,రంగా హనుమంతరావు, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, నిడమానురు వంశీకృష్ణ, కరివేద సుధాకర్, ఈది అనిల్ కుమార్ నెహ్రూ, దుంపా వెంకటేశ్వరరెడ్డి, పారుపల్లి విజయ్, నవీన్ రెడ్డి, రంగా శ్రీను, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, అద్దంకి రవికుమార్ పాల్గొన్నారు.

బస్సుల మధ్యలో ఇరుక్కుపోయిన విద్యార్థి

- ఛాతీ, కాళ్లకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన విద్యార్థి రామ్‌మహేష్

తల్లాడ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్లో బస్సు ఎక్కుతుండగా రెండు బస్సుల మధ్యన ఇరుక్కుపోయి ఇంటర్ విద్యార్థి తీవ్రంగా గాయ పడ్డాడు. గురువారం తల్లాడ బస్టాండులో జరిగిన ప్రమాదంలో కల్లూరు మండలం బత్తుపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఎక్కిరాల రామ్‌మహేష్ తీవ్రంగా గాయ పడ్డాడు. తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని కళాశాల నుంచి స్వగ్రామమైన బత్తులపల్లికి వెళ్లేందుకు తల్లాడ బస్టాండుకు వచ్చి కల్లూరు వైపుకు వెళ్లే ఆర్డనరీ బస్సు ఎక్కే క్రమంలో ఎక్స్‌ప్రెస్ బస్సు ఆకస్మాత్తుగా రావడంతో మధ్యన ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో సదరు విద్యార్థికి ఛాతీ, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న రామ్‌మహేష్‌ను చికిత్సకై 108 వాహనంలో ఖమ్మం తరలించారు.

ఏన్కూర్‌లో రెండోవ రోజు నామినేషన్లు



గార్లఒడ్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న భూక్య నర్సి

ఎన్కూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏన్కూర్ మండలంలో గురువారం 20మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం-3తో నామినేషన్ల సంఖ్య23కు చేరింది. మొత్తం25 గ్రామపంచాయతీలకు గాను 21పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను అబ్జర్వర్ శ్యాంప్రసాద్,ఎపీడీ శ్రీదేవి, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు పర్యవేక్షంచారు. ఎస్ఐ నారా బోయిన సంధ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి: యూటీఎఫ్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నాగూర్‌వలీ

మధిర రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం విద్యాహక్కు చట్టంలోని 23ను సవరించి సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శులు షేక్.నాగూర్‌వలీ, అనుమోలు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మధిరలో యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలోని టీచర్ ఎలిజిబులిటీ టెస్టుపై ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతులను ఉపయోగించుకొని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో టెట్ పరీక్షకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బందారు నాగరాజు, వీరయ్య, రఫీ, అనిత, చేడే రాణి పాల్గొన్నారు.